స్కెచ్

# స్వీయానుభవం

విశ్వమిత్ర

గోపాలం ఆనాడాఫీసుకి కొంచెం ఆలస్యంగా వెళ్ళాడు. ఆఫీసర్ ముందునుంచే అతను తన సీటుకి వెళ్ళవలసి వుండటంవల్ల ఆఫీసర్ అతన్ని ఆలస్యానికి కారణం అడక్కుండా వుంటాడను కోవటం పొరపాటు. గోపాలం సమాధానాన్ని తయారుచేసుకొనే వుంచుకొన్నాడు. ఐతే ఆ సమాధానంలో మాటలులేవు. మొహంలో ఆదుర్దా బాధ స్పష్టంగా కనిపిస్తయ్. అవి ఆయనని చూపించటానికే గోపాలం ఆఫీసుకి ఆలస్యంగా ఆనాడు వొచ్చాడు.

ఐతే గోపాలం అనుకొన్నట్టు ఆఫీసర్ అడగలేదు. ఆయన ముందునుంచి వెళ్తున్నప్పుడు తలెత్తి గోపాలంవంక ఒకసారి పరీక్షగా చూసి మళ్ళీ తల వాల్చేసుకున్నాడు. ఇంకొకప్పుడైతే ఆఫీసరు ప్రవర్తనకి గోపాలం సంతోషించేవాడే కానీ ఆనాడు సంతోషించలేకపోయాడు. పైగా గోపాలానికి ఇంకో అనుమానం పట్టుకుంది. తనవాలకం ఆఫీసర్ గ్రహించాడేమోనని. అపూటంతా అలాగే గడిపాడు. రోజూ మెల్లిగా నడిచే గడియారం ఆనాడు గిర్రున తిరిగినట్టనిపించింది గోపాలానికి. మధ్యాహ్నం మామూలుగానే ఆఫీసుకొచ్చాడు. కానీమనసు ఆఫీసు పనిమీద లేదు. కొన్నిమైళ్లు దాటిపోయింది. మూడున్నరకి ఆఫీసర్ గోపాలాన్ని రమ్మనమని కబురంపాడు. రాస్తూ, రాస్తూన్న కలాన్ని అలాగే చేతులో పట్టుకుని ఆఫీసర్దగ్గిరికి వెళ్ళాడు. ఆయన పక్కనే ఓ టెలిగ్రాపు బంట్రోతు నుంచునివున్నాడు. తల పూర్తిగా వంచి కళ్ళజోడుమీంచి చూస్తున్నాడు ఆఫీసర్ గోపాలంవంక. రోజూ కంటే ఆనాడు కూడా ఎక్కువేమీ కాని గోపాలం చెమట ఆఫీసర్ దృష్టిని ఆకర్షించింది. సానుభూతి చూపిస్తున్నట్టుగా కూర్చోమని ఫాన్ వేశాడు ఆఫీసరు. ఆయన ఎదటే గోపాలం టెలిగ్రాం చింపాడు. ఆత్రుతతో చదివి, విచారంతో ఆఫీసర్కి అందిచ్చాడు గోపాలం. ఆ టెలిగ్రాముని ఆయన కూడా, చదివి ఒక్క క్షణం గోపాలం వంక నిశితంగా చూశాడు. గోపాలం నుదురు చేత్తో పట్టుకొని తలంచుకొని ఏదో ఆలోచిస్తున్నాడు.

"గోపాలం!" పిలిచాడు ఆఫీసర్.

పులిక్కిపడి లేచిన గోపాలాన్ని చూసి ఆఫీసర్ "ఐతే, మరి ఎప్పుడెళ్తావ్?" అన్నాడు. ఆ మాటలో గోపాలం గుండెలమీంచి సగం బరువుని దింపినట్టయింది. గోపాలానికి వాళ్ళ ఆఫీసర్మీద మొదటిసారిగా కొంచెం ఇష్టం కలిగింది.

వారం రోజుల సెలవు మంజూరైంది. గోపాలం సంతోషించాడు.

* * *

గోపాలం భోజనంచేసి, వెన్నెల్లో తీరిగ్గా పడుకున్నాడు. ఆనాడు గోపాలం మనసు మనసులో లేదు. అన్నీ పొరపాట్లే! ఇంటి పనంతా అయినతర్వాత గోపాలం భార్య ఇంటికి తాళం వేసి, బైట వెన్నెల్లో పడుకోటాని కొచ్చింది. గోపాలానికి ఎందుకనో అప్పటిదాకా రాని నిద్ర అప్పుడే ఒచ్చేసింది. అరడజనుసార్లు పిలిపించుకొన్నాక, కళ్లు తెరిచి ఆవులించి "ఏమిటీ?" అని విసుక్కుంటూ అడిగాడు.

"గొలుసండీ గొలుసు!" అంది. దొంగలెవరైనా వింటారేమో అని భయపడుతున్నట్టు.

ఆమాట వినగానే 'గోపాలం' వొళ్లు పులకరించింది. తెరిచిన సగంకళ్ళతో భార్యవంక చూశాడు.

"ఆదా-! అదీ - అదీ..."

"ఏమిటండీ అదీ, అదే-మెరుగు పెట్టించుకు రమ్మని ఇచ్చిన గొలుసు!"

"అదే - ఇందాక వాడు లేకపోతే ఇవ్వలే కోటుజేబులో నేవుందే-తియ్యలేదా? రేపుఇస్తాలే!"

"అదేమిటీ? కోటుజేబులో పెట్టి - నాతో చెప్పకూడదూ?"

ఆ తర్వాత గోపాలం భార్యఅడిగిన రెండు మూడు ప్రశ్నలకూ కూడా సమాధానం చెప్ప చెప్పకుండా నిద్రపోయాడు.

తెల్లవారుజామునే గోపాలం భార్య నిద్ర లేచింది. అన్నింటికంటె ముందర గోపాలంకోటు జేబులు తడిమింది. ఎక్కడా లేదు. చొక్కా జేబు చూసింది. అక్కడా లేదు. గాభరాగా గోపాలాన్ని లేపింది. అదుర్దాతో లేచాడు గోపాలం. మళ్ళీ ఓసారి భార్య చూస్తూండగా కోటుజేబులన్నీ వెతికాడు.

"ఏమైంది?" భార్యని అడిగాడు.

"ఏమౌతుంది?"

"రాత్రి తాళం సరిగా వేశావా?"

"పొద్దున్నే నేనేగా మళ్ళీ తీసింది!"

"పోయినట్టేనా?" గోపాలం గొంతులో విచారంఏమీ కనిపించకపోయినా వింతకనిపిస్తూనే వుంది.

గోపాలం భార్య లబోదిబోమంది. ఏం ప్రయోజనం—గొలుసు పోయింది. ఎలా పోయిందో పోయింది!

* * *

ఆనాడాదివారం. గోపాలానికి ఏంతోచలేదు. పాతపేపరేదో తిరగేస్తూంటే అందులో ఓ పజిల్ కనిపించింది. కాలక్షేపానికి క్లూస్ అన్నీ చదివాడు. వేస్తే అన్నీ రైటే అయ్యేట్టున్నయ్. అన్నీ పూర్తిచేశాడు. ఆఖరిదొక్కటీ వుంది. చాలాసేపు ఆలోచించాడు.

"—చెప్పి జీవితంలో నెగ్గుకొచ్చినవాళ్లు కొంతమంది మాత్రమే!"

"నిజం. అబద్ధం! ఈ రెండిట్లో ఏదో ఒకటి వెయ్యాలి ఏదివేస్తే రైటౌతుంది.

"అబద్ధం" అని పూర్తిచేశాడు. కాయితం అంతా మడిచింతర్వాత, మళ్లీ అనుమానంవేసింది. చాలాసేపు ఆలోచించాడు. పూర్తిచేసిన పజిల్ చింపేశాడు. ఇంకో మాగజైన్కొని "నిజం" అని వేశాడు.

గోపాలానికి తన జీవితమంతా జ్ఞాపకానికి వచ్చింది. ఈ పజిల్ పూర్తిచేయటానికి తన జీవితానుభవం చాలదూ?

ఆది పోస్టుచేసిన అరగంటకి క్లర్కు వెంకట్రావు వొచ్చాడు.

ఆశ్చర్యం ఏమిటంటే అతనూ ఆనాడు అదే పజిల్ సాల్వ్ చేశాడు. ఆఖరి క్లూకి సమాధానం తెగక, గోపాలం సలహాకోసం వొచ్చాడు.

వెంకట్రావు వేసిన పజిల్ చూశాడు గోపాలం అన్నీ తను వేసినవే! తనకి అనుమాన మొచ్చినట్టే అతనికీ చివరి దానికి అనుమానమొచ్చింది.

వెంకట్రావు అడిగిన ఆఖరి దానికి సమాధానం గోపాలం "నిజం" అని చెపుదామనుకొంటూనే, "అబద్ధం" అని చెప్పాడు. నువ్వేదేశావని వెంకట్రావడిగాడు. నిశ్చయంగా చెప్పాడు గోపాలం "అబద్ధమే" వేశానని. అలా చెప్పకపోతే తనకి వచ్చే డెబ్భై ఐదువేలలో సగం వాటా అతనికి పంచుకోవలసి వొస్తుంది.

వెంకట్రావు తనమాటలు నమ్మాడని గోపాలానికి పూర్తి నమ్మకం కుదిరిందాకా గోపాలం చిట్టచివరి 'క్లూ' కి సమాధానం "అబద్ధమే"నని వీలైనంత నేర్పుగా వాదించాడు. వెంకట్రావు కూడా గోపాలం చెప్పింది నిజమేఅనిపించినట్టు మొహంలో గోపాలానికి చూపెట్టి శలవు తీసుకొన్నాడు.

తర్వాత కొన్నాళ్ళకి 'కీ' సొల్యూషన్ వొచ్చింది. మొదటినుంచి ఒక్కొక్కటి రైటవుతున్నప్పుడల్లా ఒక్కొక్క మెట్టు పైకి ఎక్కినట్టనిపించింది. ఆఖరిది మాత్రం తనది తప్పిపోయింది. "అబద్ధం" పడింది... గోపాలం చాలా బాధపడ్డాడు. మిగతావన్నీ తప్పి అదొక్కటే రైటు అయినా గోపాలానికి అంత బాధ కలిగేదికాదు. అకస్మాత్తుగా వెంకట్రావు గుర్తొచ్చాడు గోపాలానికి... అతనిది ఆల్ కరెక్ట్. ఆఖరిది తనే చెప్పాడు. వెంకట్రావు కాదనిఎంతో వాదించాడు.

ఒక్కక్షణం గోపాలం, ఈ 'కీ' సొల్యూషన్ పక్కకి తప్పించి చూశాడు. అదే ఆఖరుదే— అదే తన్ను గొంతుపిసికి చంపుతోంది.

దొంగ టెలిగ్రాము ఇప్పించుకొని వారం రోజులు సెలవు సంపాయించిన రోజూ, మెరుగు పెట్టించటానికని తీసుకెళ్ళిన గొలుసుని అమ్ముకుని పోయిందని నటించినరోజూ గోపాలం జీవితంలో ఆక్రమించుకొన్న గొప్ప స్థానాన్ని గోపాలం ఈనాడు గుర్తించాడు. ★